క్లుప్తంగా

విరిగిన భారీ వృక్షం



హాస్టల్ ఆవరణలో విరిగిపడిన వేప చెట్టు

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని ఎస్సీ బాలికల హాస్టల్ ఆవరణలోని భారీ వేప వృక్షం గురువారం మధ్యాహ్నం సగానికి విరిగి కూలిపడింది. ఆ సమయంలో విద్యార్థినులు హాస్టల్‌లో లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వేప చెట్టు కూలిపడిన శబ్దానికి చుట్టు పక్కల నివాసమున్న ప్రజలు భయాందోళనలకు లోనయ్యారు. చెట్టు కూలగా మిగిలిన వేప చెట్టు కూడా గాలులకు ఇప్పుడో అప్పుడో కూలిపోయే విధంగా ఉంది. అధికారులు స్పందించి కూలిన చెట్టును పూర్తిగా తొలగించాలని హాస్టల్ విద్యార్థినులు కోరుతున్నారు.

అక్రమంగా నిర్మించిన షాప్‌లను తొలగించాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల చుట్టూ అక్రమంగా వేసిన షాపులను తొలగించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ పాఠశాల కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి ఈషాప్‌లు అడ్డుగా ఉన్నాయరు. వీటి వలన కాంపౌండ్‌వాల్ నిర్మాణం ఆగిపోయిందన్నారు. ఆర్అండ్‌బీ ,అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా నిర్మించిన షాప్‌లను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఓ వరలక్ష్మీకి వినతి పత్రం అందించారు.

రుణాలను రీషెడ్యూల్ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఎం వెంకటస్వామి

సి.బెళగల్: పొదుపు మహిళలు బ్యాంక్‌ల ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లించి రీషెడ్యూల్ చేయించుకోవాలని ఏపీఎంలు రామేశ్వర్, వెంకటస్వామిలు సూచించారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండల మహిళా సంఘం (ఎంఎంఎస్) అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి అధ్యక్షతన పొదుపు మహిళలు, గ్రామైఖ్యా సంఘాల అధ్యక్షులు, సభ్యులు, వీఓఏలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజ్ రుణాల మంజూరు, వినియోగం, చెల్లింపులపై వారు సభ్యులకు వివరించారు. సమావేశంలో సీసీలు గుండమయ్య, రాముడు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఈఓ



ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్ రెడ్డి

గడివేముల: ఎంఈఓ కార్యాలయాన్ని డీఈఓ సుధాకర్ రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అపార్ వర్క్ షాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ అపార్ విద్యార్థికి విద్యా సంబంధమైన ఒక గుర్తింపు సంఖ్య ఉంటుందన్నారు. విద్యార్థి యొక్క అన్ని సర్టిఫికెట్లు భవిష్యత్తులో డీజీ లాకర్ ద్వారా జారీ అవుతాయన్నారు. అపార్‌ను తప్పులు లేకుండా నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ విమల వసుంధర దేవి, సిబ్బంది విజయ్, హిదాయతుల్లా, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారి దేవాలయానికి నూతనంగా ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ రామలింగారెడ్డి గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఆసక్తి సభ్యులు వచ్చే నెల 11వ తేదీలోపు నంద్యాల జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఒత్తిడిని జయించాలి

పాణ్యం: విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలని, అప్పుడు విజయాలు చేకూరుతాయని శాంతిరామ్ జనరల్ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ఓంకార్ సింధూజ తెలిపారు. గురువారం సుగాలిమెట్ట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఆమె సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అవసరమున్న మేరకే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం పిల్లలకు ఎదురవుతున్న సమస్యలను చిత్రాల ద్వారా వివరించారు.

మంత్రి ఇలాకాలో సమస్యల తిష్ట

- బళ్లారి చౌరస్తా మలుపు- మెడికల్ కళాశాల వద్ద విస్తరణ పనుల్లో జాప్యం
- సిఫార్సు చేసిన రహదారి వెడల్పు పనులు ఇంకెప్పుడు?
- ఉన్న టెండర్ల రద్దు – కొత్త టెండర్ల పరిస్థితేంటి?
- వాటర్ వర్క్స్ దోపిడీపై కదలని యంత్రాంగం
- అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చినా చర్యల్లేవు
- అటకెక్కిన వీధి కుక్కల నియంత్రణ ఆపరేషన్లకు బ్రేక్
- నేడు నగరపాలక సంస్థ పాలకవర్గ సర్వసభ్య సమావేశం



నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): ప్రభుత్వం మారి 5 నెలలు కావొస్తోంది. కర్నూలు అర్బన్‌తో పాటు పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు అధికార పార్టీ నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయినా ఇప్పటివరకు చెప్పుకోదగ్గ అభివృద్ధి కనిపించడం లేదు. ఈ ఐదు నెలల్లో రెండు, మూడు సార్లు మంత్రి, ఎమ్మెల్యేలు సమావేశాలు నిర్వహించినా పనులు మాత్రం ముందుకు కదల్లేదు. ప్రత్యేకించి మంత్రి టీజీ భరత్ మున్సిపల్ అధికారులు, సెక్షన్ హెడ్‌లతో సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేశారు. వచ్చే సమావేశం లోపు పరిష్కరించాలని ఆదేశించారు. అయినా ఆ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇక నగరంలోని బళ్లారి చౌరస్తా ఆంజనేయస్వామి గుడి మలుపు వద్ద రహదారిని విస్తరించేందుకు ఇప్పటికే ఏపీఎస్పీ అధికారులతో మాట్లాడారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇక రోడ్ల విస్తరణ పనులు సైతం అలాగే ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఈ పనులకు సంబంధించి నిధులు విడుదల చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు అవుతున్నా విస్తరణ పనులపై మీటింగ్‌కే పరిమితం అయ్యారు. స్థానిక పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి పెద్దమార్కెట్ రాఘవేంద్ర మఠం వరకు, కిడ్స్ వరల్డ్ నుంచి బాపూజీనగర్, కేవీఆర్ గార్డెన్, ఉస్మానియా కళాశాల, కల్లూరు దర్వాజా మీదుగా బుధవారపేట కలెక్టరేట్ వరకు రహదారులను విస్తరించాలని ప్రణాళిక రూపొందించడం, చర్చించడం జరిగింది. అయితే చర్చలకే పరిమతమయ్యారు. తప్పా పనులు ముందుకు సాగలేదు.

వీధి కుక్కల నియంత్రణకూ చర్యల్లేవ్

నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. గత నెలలో ఒకేరోజు పాతబస్తీలో 30 మందికి పైగా చిన్నారులను వీధికుక్కలు కరిచాయి. మంత్రి టీజీ భరత్ బాధితులను ఆసుపత్రిలో పరామర్శించారు. రూ.10 వేలు చొప్పున సాయం అందించారు. అలాగే వీధి కుక్కలకు ఆపరేషన్ల ప్రక్రియ త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు.

టెండర్లు రద్దు చేసి కొత్తగా పిలవక..

కొత్త ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు అవుతోంది. ఇప్పటివరకు వినాయక నిమజ్జనం అత్యవసర పనులకు సంబంధించి షార్ట్ టెండర్లు తప్పా అభివృద్ధి పనుల టెండర్ల ప్రక్రియలో అంతులేని జాప్యం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పిలిచిన టెండర్లను సైతం రద్దు చేశారు. 25 శాతంలోపు పనులు చేసిన వాటిని రద్దు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వైఎస్సార్‌సీపీ పాలనలో 'గడప గడపకు మన ప్రభుత్వం' పేరుతో ప్రతి సచివాలయం పరిధిలోని కాలనీలలో ప్రజలు సూచించిన అభివృద్ధి పనులు చేపట్టగా వాటినీ ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. పాత వాటిని రద్దు చేసి, కొత్త వాటిని పిలవకపోవడంతో పాలన స్తంభించిందన్న విమర్శలు ఉన్నాయి.

వాటర్ వర్క్స్ దోపిడీపై చర్యలేవీ?

నగరవాసులకు సురక్షిత మంచినీరు సరఫరా చేయాలంటే వాటర్ వర్క్స్ విభాగం కీలకం. ఈ విభాగంపై అనేక విమర్శలు వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్లు కొల్లగొట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పనిచేసే అధికారి బదిలీ కాకుండా ప్రజాప్రతినిధుల సిఫార్సుతో కొనసాగుతున్నారు. బినామీ పనులు, అత్యవసరం పేరుతో అనవసరమైన పనులు, పనిచేయకుండా ఇంటి వద్ద ఉన్నా జీతాలు మంజూరు చేయడం, ప్రతి అవసరానికి వర్క్ ఇన్‌స్పెక్టర్లను వాడుకోవడం వంటి విమర్శలు ఉన్నాయి. అయినా సదరు ఉన్నతాధికారులు కనీసం వాస్తవాలు తెలుసుకునేందుకు కూడా ప్రయత్నించకపోవడం గమనార్హం.

ఆక్రమణలపై చర్యలేవి...

నగరపాలక సంస్థ పరిధిలో అనేక నిర్మాణాలు నిబంధనలు పాటించలేదు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. వీటిపై చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక అధికారులు పత్రికలకు ప్రకటించారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేశారు. అంతే ఆ తరువాత ఏమైందో ఏమో యథావిధిగా మిన్నకుండిపోయారు. దీంతో అక్రమ నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి.

నేడు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం

నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో శుక్రవారం ఉదయం 11 గంటలకు పాలకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు గురువారం వెల్లడించారు. మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు గౌరుచరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, డిప్యూటీ మేయర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 7 తీర్మానాలు, పలు అంశాలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటారని వెల్లడించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



చికిత్స పొందుతున్న రోగి వివరాలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

కోడుమూరు రూరల్ : ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్యులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశించారు. గురువారం కోడుమూరులోని ప్రభుత్వాసుపత్రిని ట్రైనీ కలెక్టర్ కల్యాణితో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యం కోసం వేచివున్నవారితోపాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. అనంతరం కాన్పులు, జనరల్ వార్డులను కలెక్టర్ సందర్శించి వైద్య సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు, నెలలో ఎన్ని కాన్పులు జరుగుతున్నాయి... తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆరోగ్య శ్రీ కేసులు ఏమైనా వస్తున్నాయా అని పీహెచ్‌సీ వైద్యాధికారి డా.నాగరాజును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

మొక్కుబడిగా సాగిన 'పీజీఆర్ఎస్'



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ బొంతల మునెప్ప, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ రాణెమ్మ తదితర అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే కనీసం సమస్యపై ఆరా తీయకపోవడంతో బాధితులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వినతులపై ఎమ్మెల్యే సంతకం చేసి అధికారులకు అందజయేడం తప్పా చేసిందేమీ లేదని బాధిత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం ఏ మాత్రం ఉపయోగపడడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

కోడుమూరు రూరల్ : రీసర్వేలో నెలకొన్న భూసమస్యల పరిష్కారం కోసం గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని అనుగొండలో తహసీల్దార్ వెంకటేష్ నాయక్ గ్రామ సభ నిర్వహించారు. రీసర్వే సమస్యలపై రైతులను నుంచి తహసీల్దార్ అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సునీల్, గ్రామ వీఆర్వో, సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో....

గూడూరు మండలంలోని పెంచికలపాడులో గురువారం తహసీల్దార్ రామాంజినేయులు రీసర్వేలో నెలకొన్న భూసమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వరరెడ్డి, మండల సర్వేయర్ బాలునాయక్, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆర్.కొంతలపాడులో గ్రామసభ

కర్నూలు రూరల్ : మండలంలోని ఆర్.కొంతలపాడు గ్రామ సచివాలయంలో గురువారం రీ సర్వే సమస్యలపై తహసీల్దార్ రమేష్ బాబు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతులను వినతులు స్వీకరించారు. సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని రైతులకు తహసీల్దార్ హామీ ఇచ్చారు.



పెంచికలపాడు గ్రామసభలో మాట్లాడుతున్న గూడూరు తహసీల్దార్ రామాంజినేయులు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. 28 మంది రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వో రామ్మోహన్‌రెడ్డి, సర్వే సహాయకులు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

కల్లూరు : మండల పరిధిలోని తడకనపల్లె గ్రామంలో గురువారం తహసీల్దార్ ఆంజనేయులు రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలపై బాధిత రైతుల నుంచి తహసీల్దార్ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సహెరాబీ, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు జుబేదాబీ పాల్గొన్నారు.

పాణ్యం: మండల పరిధిలోని చిలకల గ్రామంలో గురువారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన తహసీల్దార్ పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్‌రెడ్డి, ఆర్ఐ రామ్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అనుగొండ గ్రామసభలో అర్జీలను పరిశీలిస్తున్న కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్‌నాయక్



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు



సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నేడు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సీ.క్యాంపు రైతుబజారును శుక్రవారం బంద్ చేస్తున్నట్లుగా ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్ తెలిపారు. పారిశుద్ధ్య లోపం తెలెత్తకుండా ప్రతి నెలా ఒక రోజు బంద్ చేసి శానిటేషన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ మేరకు 25న రైతుబజారును బంద్ చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేతవరం గ్రామసభలో గందరగోళం



తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని కేతవరం గ్రామంలో గురువారం రీ సర్వే భూ సమస్యలపై అధికారులు గ్రామ సభలో గందరగోళం చోటు చేసుకుంది. గ్రామ సర్పంచ్ గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన గ్రామసభకు తహసీల్దార్ విద్యాసాగర్, రీసర్వే డీటీ శర్మిలారెడ్డి, మండల సర్వేయర్ శంకర్‌మాణిక్యం బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. అయితే పదిహేనేళ్లుగా బీడు భూములను సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు, పాసుపుస్తకాలు ఎందుకు ఇవ్వడం లేదని సీపీఎం నాయకులు తహసీల్దార్‌ను నిలదీశారు. దీంతో సభ గందరగోళంగా మారింది. బీడు భూములను సాగుకు అనుగుణంగా మార్చుకునేందుకు పేదలు ఎంతో ఖర్చు చేశారని, అయితే అధికారులు మాత్రం పాసుపుస్తకాలు ఇవ్వడం లేదని సీపీఎం నాయకులు రామకృష్ణ, వ్యయసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న తహసీల్దార్‌తో వాగ్వాదం చేశారు. పేదలకు న్యాయం చేయకుంటే ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటరాముడు, వెంకటేశ్వర్లు, బుగ్గరాముడు, వెంకటస్వామి, నాగరాజు, రైతులు నాగన్న, నాగరాజు, లక్ష్మిదేవి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- జీడీపీకి హంద్రీనీవా నీళ్లు విడుదల చేయకపోవడంపై ఆగ్రహం
- అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



అధ్వానంగా ఉన్న రోడ్ల పరిస్థితిపై ఆర్అండ్‌బీ ఏఈని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ, ఎర్రదొడ్డి సర్పంచ్

కోడుమూరు రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ అధ్యక్షతను గురువారం ఎంపీడీఓ రాముడు నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. జిల్లాకు సాగు, తాగునీరు అందించే గాజులదిన్నె ప్రాజెక్టుకు హంద్రీనీవా కాల్వ ద్వారా నీటిని విడుదల చేయకపోవడంలో ఆంతర్యమేంటంటూ జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి జీడీపీ, ఎల్ఎల్‌సీ అధికారులపై మండిపడ్డారు. ఒక వైపు ప్రాజెక్టులు నిండి నీటిని కిందకు విడుదల చేస్తున్నా గాజులదిన్నె ప్రాజెక్టుకు హంద్రీనీవా నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని జీడీపీ ఏఈ నారాయణ, ఎల్ఎల్‌సీ డీఈఈ సుబ్బారాయుడిని నిలదీశారు. అదేవిధంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సభలో లేవనెత్తారు. ఐదు తరగతులకు ఒక్క టీచర్ ఎలా చదువు చెబుతారని ఎర్రదొడ్డి సర్పంచు మధుసూదన్‌రెడ్డి ప్రశ్నించగా త్వరలో సర్దుబాటు చేస్తామని ఎంఈఓ వసంతలక్ష్మి తెలిపారు. రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని, జనాలు చస్తేగాని మీరు మారరా, కనీసం రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు మట్టిని వేయించలేరా అంటూ ఆర్అండ్‌బీ ఏఈ లక్ష్మినారాయణపై జెడ్పీటీసీతోపాటు సర్పంచ్‌లు మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులు నడపడం లేదంటూ పులకుర్తి, క్రిష్టాపురం, ఎర్రదొడ్డి సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకురాగా ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ రాముడు హామీ ఇచ్చారు. సబ్సిడీ పప్పుశనగ అందుబాటులో ఉందని ఏఓ రవి ప్రకాష్, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా మంచినీటి సరఫరాలో తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ తెలిపారు. పీఆర్ ఏఈ గంగరాజు, సీడీపీఓ వరలక్ష్మి, ఏపీఎం రాయుడు, ఏపీఓ మోదీన్‌బాషా, ఆరోగ్య, అగ్నిమాపక దళం, పశువైద్య శాఖలకు సంబంధించిన అధికారులు తమ తమ ప్రగతి నివేదికలను చదివి విన్పించారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

కోడుమూరు రూరల్ : గూడూరులో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా పూర్తి చేయించాలని కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం హౌసింగ్ ఈఈ ప్రభాకర్, డీఈఈ వాసుదేవరావు, మున్సిపల్ మేనేజర్ విజయలక్ష్మితో గృహ నిర్మాణాలపై ఆర్డీఓ సమీక్షా నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ 100రోజుల ప్రణాళికలో భాగంగా ఆర్ఎల్, ఆర్సీ లెవల్లో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయించాలన్నారు. ఇండ్ల నిర్మాణంలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ వివరించారు. కార్యక్రమంలో ఎంబీసీ జమ్మన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, నిందితుడిని అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కోడుమూరు రూరల్: కృష్ణగిరి మండలం తొగర్చేడు గ్రామంలో గురువారం కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్, కోడుమూరు ఎక్సైజ్ అధికారులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. తొగర్చేడుకు చెందిన రామానాయుడు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని రూ.55 వేలు విలువ చేసే కర్ణాటకకు చెందిన 1440 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. దాడుల్లో కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జయరాం నాయుడు, కోడుమూరు ఎక్సైజ్ ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా బెల్లం స్వాధీనం

ఓర్వకల్లు: మండలంలోని గుమ్మితం తండాలో నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో దాడులు నిర్వహించారు. లోక్ నాయక్ అనే వ్యక్తి సారాతో పాటు, బెల్లాన్ని విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే లోక్‌నాయక్‌ను అదుపులోకి తీసుకునేందుకు వెళ్లగా పరారయ్యాడు. ఈ మేరకు 30 లీటర్ల సారా, 1,120 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దేవుని మార్గాన్ని అనుసరించాలి



సదస్సులో ప్రసంగిస్తున్న ఫాదర్ అజీస్

ఓర్వకల్లు: కులమతాలు వేరైనా ప్రతి ఒక్కరూ తమ ఇష్టదైవమైన దేవుని మార్గాన్ని అనుసరించాలని సీనాయ్ ధ్యాన ఆశ్రమం డైరెక్టర్, రెవ.ఫా.అజీస్ పేర్కొన్నారు. మండల కేంద్రం ఓర్వకల్లులోని సకల జనుల మాత దేవాలయంలో ఈ నెల 20 నుంచి ప్రారంభమైన కుటుంబ నూతనీకరణ సదస్సులు గురువారం ముగిశాయి. స్థానిక విచారణ గురువులు రెవ.ఫా. ఆనందరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. చివరి రోజు జరిగిన సదస్సుకు సుమారు 120 కుటుంబాలు హాజరయ్యారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



బస్టాండ్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ తబ్రేజ్

సి.బెళగల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ సూచించారు. మండల కేంద్రం సి.బెళగల్ బస్టాండ్‌లో గురువారం ఎస్ఐ తిమ్మారెడ్డితో కలిసి సీఐ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు నిబంధనలు పాటించని పది మందిపై కేసు నమోదు చేసి రూ.4,500 జరిమానా విధించారు. ట్రాఫిక్ నియమనిబంధనలు సీఐ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సీఐ స్థానిక పోలీస్ స్టేషన్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు, నేరాలు, ఇతర సమస్యలపై ఎస్ఐని సీఐ అడిగి తెలుసుకున్నారు.